ప్రభాత
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గురువారం 21 మే 2026


### 22,23,24 తేదీలలో జాతీయ స్థాయి

## థైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలు

ప్రొద్దుటూరు అర్బన్ , మే 20, ప్రభాతవార్త :




ఈ నెల 22 నుండి ప్రొద్దుటూరు పట్టణంలో తొలి సారిగా జాతీయ స్థాయి థైక్వాండో ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ సలీం తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో వారు ఈ విషయమై ప్రచార పత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు దాదాపు 15 రాష్ట్రాల క్రీడాకారులు హాజరవుతారని 22 నుండి 3 రోజుల పాటు ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ నందు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కాడెట్ క్యాటగిరీ, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ క్యాటగిరీ, టాక్టింగ్ వైట్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలను క్రీడా శాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభిస్తారని, శాప్ ఛైర్మన్ రవి నాయుడు, టిడిపి నాయకులు కొండారెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ మెంబర్ మాస్టర్ హరి, ఛీఫ్ అడ్వైజర్ రుహుల్లా, ఫయాజ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ అధికారులకు రక్తపోటు పరీక్షలు

రాజుపాళెం, మే 20, ప్రభాతవార్త:




ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఈనెల 17వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయ అధికారులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తపోటు, షుగర్ పరీక్షలు చేయు కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హనీఫ్ బాబా ఆధ్వర్యంలో మండల తాసిల్దార్, ఎంపీడీవో, విద్యాశాఖ కార్యాలయలలోని అధికారులకు, పోలీస్ స్టేషన్ లోని ఎస్ఐ మరియు పోలీస్ లకు రక్త పరీక్షలను, రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు కూడా అందించనున్నట్టు తెలిపారు. వైద్యాధికారి మాట్లాడుతూ రక్తపోటు సైలెంట్ కిల్లరని జాగ్రత్తగా ఉండాలని, బీపీ లక్షణాలు ఉన్నవారు తగు జాగ్రత్తలు వైద్యము తప్పనిసరి అని తెలిపారు. కార్యక్రమంలో జయమ్మ, లక్ష్మీనారాయణ, సరస్వతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేడిగాలుల తీవ్రత పెరుగుతోంది

**గాలివీడులో గరిష్టంగా 42 డిగ్రీల నమోదు**

**ప్రజలు జాగ్రత్తగా ఉండాలి కలెక్టర్ విజ్ఞప్తి**

మదనపల్లి, మే 20: ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లాలో తీవ్ర ఎండలు, వడగాల్పులు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. బుధవారం జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీల సెల్సియస్ గాలివీడు మండలంలో నమోదైనట్లు తెలిపారు. రాబోయే రోజులలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైతే తప్ప మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని సూచించారు.ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 344 చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ సూచనలు పాటించాలని కలెక్టర్ కోరారు.

### ఎండల తీవ్రతతో

## రైతు పండుగ వాయిదా

**సివియర్ హీట్‌వేవ్స్ నేపథ్యంలో కలెక్టర్ నిర్ణయం**

**త్వరలో కొత్త తేదీలు ప్రకటిస్తామని వెల్లడి**

పులివెందుల, మే 20 ప్రభాతవార్త :



జిల్లాలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించాల్సిన "రైతు పండుగ" కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రకటించారు. వాతావరణ శాఖ జిల్లాకు సివియర్ హీట్‌వేవ్స్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.రాబోయే మూడు రోజుల పాటు జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండటంతో రైతులు, వ్యవసాయ కార్మికులు మరియు ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యగా కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. రైతుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ రైతు పండుగ కార్యక్రమాన్ని అనుకూల వాతావరణ పరిస్థితులు ఏర్పడిన వెంటనే నిర్వహిస్తామని, కొత్త తేదీలను త్వరలో ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు.ప్రస్తుతం ప్రజలు ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అవసరం లేకుండా మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు పాటించాలని అధికార యంత్రాంగం సూచించింది.

### పోటకూటికోసం చేపలకోసం వెళ్ళి

## చెరువులో వ్యక్తి మృతి

**మృతుని కుమార్తెకు నేడు, రేపు జరగాల్సిన వివాహం వాయిదా**

నిమ్మనపల్లె, మే 20 ప్రభాతవార్త :



పొట్టకూటి కోసం రోజూ మాదిరిగానే చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నిమ్మనపల్లె చెరువులో పడి ఓ వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్ఐ రామక్రిష్ణ కథనం మేరకు నిమ్మనపల్లె మండలం తవళం పంచాయితీ చౌకిళ్ళవారిపల్లెకు చెందిన బోదాల చంద్రా కుమారుడు రమణ స్థానికంగా గల నిమ్మనపల్లె చెరువుకు వెళ్ళి గాలాల ద్వారా చేపలను పట్టే దశలో ప్రమాదవశాత్తు చెరువులో పడి కాళ్లకు గాలంకు ఉన్న వైర్లు చుట్టుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం గ్రామస్థుల సహాయంతో మృ తదేహాన్ని బయటకు తీసి మదనపల్లె ఆసుపత్రి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతునికి భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె కలరు. దురదృష్టం చేత బుధవారం మృతుని కుమార్తెకు గాలివీడులో పెళ్ళికుమార్తె వెళ్లాల్సిన ఉండగా బుధ, గురువారాల్లో వివాహం జరగాల్సి ఉంది. అయితే ఈ విధంగా జరగడంతో చౌకిళ్ళవారిపల్లెలో, మృతుని కుటుంబంలోనూ, బంధువుల్లోనూ విషాధ చాయలు నెలకొన్నాయి. కుమార్తె వివాహం వాయిదా పడడంతో వారి బంధువులు ఇతని మృతి చెందడంతో సోకసముద్రంలో మునిగిపోయారు.

### ఔషధ రంగ సమస్యలపై

## కెమిస్టుల ఆగ్రహం - పీలేరులో ర్యాలీ

పీలేరు, మే 20 ప్రభాతవార్త:


వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

అఖిల భారత కెమిస్టు మరియు డ్రగ్గిస్టుల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పీలేరు పట్టణంలోని మెడికల్ షాప్ యజమానులు, కెమిస్టులు బుధవారం ఐక్యంగా ముందుకు వచ్చి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన పురవీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టి, అనంతరం పీలేరు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 12.40 లక్షలకుపైగా కెమిస్టులు, డ్రగ్గిస్టులు, డిస్ట్రిబ్యూటర్లు ఔషధ వ్యాపార రంగంలో పనిచేస్తున్నారని, వారిపై ఆధారపడి కోట్లాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. అయితే ఇటీవలి కాలంలో ఔషధ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు చిన్న, మధ్యతరహా మెడికల్ వ్యాపారుల మనుగడకు ముప్పుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా అక్రమ ఈఫార్మసీల కార్యకలాపాలు విస్తరిస్తుండడం, పెద్ద కార్పొరేట్ సంస్థలు అనుసరిస్తున్న అనైతిక ధరల విధానం, కొన్ని నోటిఫికేషన్ల అమలు కారణంగా స్థానిక మెడికల్ షాపులపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా చట్టపరమైన పర్యవేక్షణ లేకుండా ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలు జరగడం వల్ల ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వైద్యుల సూచనలు లేకుండా మందులు అందుబాటులోకి రావడం, యాంటీబయాటిక్స్ వంటి మందుల దుర్వినియోగం పెరగడం, నకిలీ ప్రిస్క్రిప్షన్ల వినియోగం, నాణ్యతలేని లేదా సరిగా నిల్వ చేయని మందుల సరఫరా, ఫార్మసిస్టు-రోగి మధ్య ప్రత్యక్ష సంబంధం తగ్గిపోవడం వంటి అంశాలు భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలకు దారితీయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అక్రమ ఈఫార్మసీల నియంత్రణ, కార్పొరేట్ సంస్థల అనైతిక విధానాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ఔషధ వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ సెన్సస్ విధుల్లో బిజీగా ఉండటంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ ఈ ఉద్యమం కేవలం వ్యాపార ప్రయోజనాల కోసం కాదని, ప్రజారోగ్య పరిరక్షణ, ఔషధ రంగంలో పారదర్శకత, నియంత్రణ కోసం చేపడుతున్న ఉద్యమమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు పట్టణ మెడికల్ షాప్ యజమానులు, ప్రతినిధులు మహేష్, వెంకటేష్, నాగరాజ, సురేంద్ర, రాజేష్, శంకర, భాస్కర, సుబ్బయ్య, ఇలియాజ్, చలపతి, కృపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రోజు రోజుకు తీవ్రమవుతున్న ఎండలు

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**మున్సిపల్ కమిషనర్ వెంకట నరసింహారెడ్డి**

బద్వేల్ అర్బన్ మే 20 ప్రభాత వార్త :




రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మరియు వడగాల్పుల దృష్ట్యా మున్సిపాలిటీలోని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ వాకమల్ల వెంకట నరసింహారెడ్డి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట ఈ నెల 26వ తేదీ వరకు తీర ప్రాంతాల్లో తీవ్ర ఉక్కపోత మరియు వడగాల్పులు నమోదయ్యే అవకాశం ఉన్నందున, ప్రజలు ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు పాటించాల్సిన ముఖ్యమైన సూచనలను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

**ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

దాహం వేయకపోయినా తరచుగా మంచినీరు తాగుతూ ఉండాలి. పానీయాలు: ఓ.ఆర్.ఎస్ ( ఓ ఆర్ ఎస్), మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవ పదార్థాలను తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి శాతాన్ని కాపాడుకోవచ్చున్నారు, ఎండ నుండి రక్షణ కోసం వదులుగా ఉండే కాటన్ (నూలు) దుస్తులను ధరించాలి. సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లడం నివారించాలి.

**ఏమి చేయకూడదు?**

మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దన్నారు, ఖాళీ కడుపుతో ఎండలోకి వెళ్లడం ప్రమాదకరం. పిల్లలను, పెంపుడు జంతువులను పార్క్ చేసిన వాహనాల్లో ఒంటరిగా వదిలేయకూడదన్నారు. ఎండలో కఠినమైన శారీరక శ్రమ మరియు వ్యాయామాలు చేయకపోవడం ఉత్తమం.

**వడదెబ్బ లక్షణాలు ఇవే..**

తీవ్రమైన దాహం, తలనొప్పి, శరీరం బలహీనపడటం, వాంతులు మరియు విపరీతమైన చెమట పట్టడం వంటివి వడదెబ్బ లక్షణాలుగా గుర్తించాలని కమిషనర్ తెలిపారు. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని లేదా తగిన ప్రాథమిక చికిత్స అందజేయాలని ఆయన సూచించారు. మున్సిపల్ యంత్రాంగం ప్రజల క్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని, ప్రతి ఒక్కరూ ఈ సూచనలను పాటించి వేసవి తాపం నుండి తమను తాము రక్షించుకోవాలని కమిషనర్ వెంకట నరసింహారెడ్డి తెలియజేశారు.

### విద్యుత్ బస్సులను

## ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న దృశ్యం

పీలేరు, మే 20 ప్రభాతవార్త:

ఆర్టీసీకి అవసరమైన విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎన్ఎంయూ డిపో అధ్యక్ష, కార్యదర్శులు సి.వి. రమణ, ఆదినారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ శక్తి బస్సుల్లో జీరో టికెట్ ఇచ్చే విధానం నిలుపుదల చేసి మిగతా ప్రయాణీకులకు టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుని సిబ్బందికి పనిభారం తగ్గించాలన్నారు. పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏలు, అరియర్స్, లీవ్ ఎన్క్యాష్మెంట్ ఇవ్వాలని డిమాండ్లు చేశారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు కె.కె. నాయుడు, ఆర్.వి. గోపాల్, మధుసూదన్, నాగరాజ, శ్రీనివాసులు ఎ.ఆర్. చంద్ర. బి.ఆర్. నాయక్, రఘు. ఈశ్వరయ్య. రఫీ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కెమిస్టుల బంద్ విజయవంతం

మదనపల్లె క్రైమ్, మే 13 ప్రభాతవార్త.

అక్రమ ఈ ఫార్మసీలకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడి) చేపట్టిన బంద్ విజయవంతం అయింది. బుధవారం మదనపల్లి కెమిస్ట్ ల అసోసియేషన్ అధ్యక్షులు భూషణ్ గుప్తా కార్యదర్శి శ్రీధర్ కోశాధికారి బాలాజీ ల ఆధ్వర్యంలో బంద్ కొనసాగింది. ఉదయం నుంచి పట్టణంలోని అన్ని మందుల దుకాణాలను మూసివేసి నిరసన చేపట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ అక్రమ ఈఫార్మసీల వల్ల ప్రజారోగ్యానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. మందులు రోగి ప్రాణాలతో ముడిపడి ఉంటాయని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో సాగుతున్న మందుల విక్రయాల వల్ల అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లైన్ మందుల విక్రయాలతో ఒకే ప్రిస్క్రిప్షన్‌ను పలుమార్లు వాడటం, నకిలీ ప్రిస్క్రిప్షన్లతో మందులు పొందే అవకాశం ఉందన్నారు. యాంటీబయోటిక్స్, చెడు వ్యసనాలకు అలవాటు చేసే మందులు సులభంగా లభించడం వల్ల యువత ప్రమాదంలో పడుతోందన్నారు. పెద్ద కంపెనీలు డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ నిబంధనలను అతిక్రమిస్తూ భారీ డిస్కౌంట్లు ఇస్తున్నాయని, దీనివల్ల చిన్న కెమిస్టుల జీవనాధారం దెబ్బతింటోందన్నారు. కోవిడ్ సమయంలో అత్యవసరంగా తెచ్చిన జీస్సార్ 220(ఈ ) నిబంధనను తక్షణమే ఉపసంహరించుకుని, ఈఫార్మసీలకు అనుమతినిచ్చే జీస్సార్ 817(ఈ ) నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా కొనసాగుతున్న ఆన్‌లైన్ ఫార్మసీలను తక్షణమే మూసివేయాలన్నారు. దీంతో పాటు దోపిడీ ధరల విధానాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 47 ప్రకారం ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రతినిధులు గుర్తు చేశారు. ప్రధానమంత్రికి, సంబంధిత శాఖలకు పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడం వల్లే బంద్ చేయాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని వారు హెచ్చరించారు. దేశంలోని మందుల పంపిణీ వ్యవస్థ బలహీనపడితే, ఆ నష్టం సామాన్య రోగికే ఎక్కువగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మురళి, సత్యప్రసాద్, అంజాద్, దేవప్రసాద్ రాజశేఖర్ పార్థసారధి శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




### ఉపాధిలో శ్రామికుల

## సంఖ్యను పెంచాలి

దువ్వూరు, మే 20, ప్రభాతవార్త:

మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న ఉపాధి పనుల్లో శ్రామికుల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రతి శ్రామికునికి 307 రూపాయలు కూలి పడే విధంగా చూడాలన్నారు. ఉపాధి శ్రామికులు వడదెబ్బకు గురికాకుండా ఉదయం 6 నుండి 10 లోపలే పనులు చేయించే విధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది పరిశీలించాలన్నారు. ఈ సమీక్షలో ఏపీఓ లక్ష్మీ మ్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ సీజ్ చేసినా...తాళాలు పగలగొట్టి ఓపెన్...

**కమిషనర్ ఫిర్యాదుతో కేసు నమోదు**




ఈనెల 16న దుకాణాలు సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాజంపేట, మే 20 ప్రభాతవార్త


తాళాలు పగులకొట్టి రూమ్ తెరిచిన దృశ్యం

లక్షలాది రూపాయలు బకాయిలు పేరుకపోవడంతో మున్సిపల్ అధికారులు తాళాలు వేస్తే పగలగొట్టి మరి ఓపెన్ చేసిన సంఘటన రాజంపేట మున్సిపాలిటీలో జరిగింది. దీంతో మున్సిపల్ కమిషనర్ రాజంపేట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలలోకి వెళితే... రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్లో 8 గదులకు సంబంధించి 24.90, లక్షల బకాయిలు చెల్లించకపోవడంతో అధికారులు ఈనెల 16న పోలీసుల సమక్షంలో రూములకు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఊహించని విధంగా నాలుగు గదులను మన్నూరు పదవిలో ఉన్న ఓ నేత అండదండలతో 16.50 లక్షల బకాయి ఉన్న గదుల తాళాలు పగలగొట్టి ఆక్రమించుకున్నారనీ తెలిసింది.ఈ విషయం సిబ్బంది మున్సిపల్ కమిషనర్ ఎస్ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనేమున్సిపల్ కమిషనర్ రాజంపేట అర్బన్ పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు పంపారు. మున్సిపల్ సిబ్బంది పోలీసులు సమక్షంలోనే స్వాధీనం చేసుకున్న గదుల తాళాలు పగలగొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు రాజంపేట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## మెడికల్ షాపులు బంద్

దువ్వూరు, మే 20, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులోనూ, కానగూడూరు, గుడిపాడులో ఉన్న మెడికల్ దుకాణాలు బుధవారం బంద్ నిర్వహించారు. ఆన్ లైన్ విధానంలో మందుల విక్రయం, అలాగే కార్పొరేట్ సంస్థలు డిస్కౌంట్ ఇస్తున్న మందులను విక్రయాలను నిరోధించాలని కోరుతూ మెడికల్ షాపులు బంద్ పాటించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ దుకాణాలు నిర్వహించి పేదలకు సేవలు చేస్తున్నామని, ఇటీవల ప్రభుత్వ విధానాలు తమ పొట్ట కొడుతున్నాయని పేర్కొన్నారు. అందుకు నిరసనగా ఈ షాపులను బంద్ చేసినట్లు తెలిపారు. అనంతరం తహసిల్దార్ సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు.





## రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడేది లేదు : ఎంపీ
3వ పేజీలో


## గాంధారి యోగ విద్య శిక్షణ. 2వబ్యాచ్ ముగింపు కార్యక్రమం

వేంపల్లె: మే 20 ప్రభాతవార్త

వేంపల్లె వాసవి జూనియర్ కళాశాలలో గత ఆరు రోజులుగా నిర్వహించిన గాంధారి యోగ విద్య శిక్షణా కార్యక్రమం బుధవారం ఘనంగా ముగిసింది. 6 నుండి 16 సంవత్సరాల వయసు గల 15 మంది విద్యార్థులు ఈ శిక్షణలో పాల్గొని మానసిక శక్తి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, కళ్లకు గంతలు కట్టుకొని కలర్స్ గుర్తించడం, సైకిల్ తొక్కడం,మోటార్ సైకిల్ తోలడం,ఒక మనిషిని వాసన పసిగట్టి ఆ మనిషి ఎక్కడ ఉన్నా , అతనిని పట్టుకోవడం వంటి వాటిలో సురుగుగా పాల్గొన్నారు. బుధవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బి ఎన్ ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ కరెస్పాండెంట్ నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన గురువు, రిటైర్డ్ టీచర్ శ్రీ కవి వరప్రసాద్ రావుని పూల మాల, శాలువా, పండ్ల బుట్టతో, శివ ఘనంగా సన్మానించారు. శ్రీ కవి వరప్రసాద్ రావు మాట్లాడుతూ గాంధారి యోగ విద్య, మిరాకిల్స్, సిక్స్త్ సెన్స్ ద్వారా పిల్లల్లో దాగి ఉన్న అంతర్గత శక్తులను వెలికితీసి, చదువులో రాణించేలా తీర్చిదిద్దడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల



తల్లిదండ్రులు, వాసవి జూనియర్ కళాశాల రిటైర్ ప్రిన్సిపాల్ జీ . నరసింహులు, గొర్లమండల సుజాతమ్మ,శారదా స్కూల్ టీచర్ రాజ్యం,పొన్నూరు రామాంజనేయులు టీచర్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు,తల్లి, తండ్రులకు దేరంగుల రామాంజనేయులు భోజన వసతి కల్పించారు.

## టిడిపి అధ్యక్షుడుకు ఆత్మీయ సన్మానం

సుండుపల్లె, మే 20,ప్రభాతవార్త:




కువైట్‌లో వైభవంగా ఎ న్ఆర్ఐ టీడీపీ కువైట్ ఆ ధ్వర్యంలో నిర్వహించిన మినీ మహానాడుకు విచ్చే సిన టిడిపి అధ్యక్షుడు చప్పిడి.రమేష్ నాయుడు కు కువైట్ దేశం మాలి యా ప్రాంతంలో ఉన్న స్పైసీ రెస్టారెంట్ నందు ఘనంగా సన్మానించడం జరిగిందని సుగవాసి యువసేన అధ్యక్షులు కంచన. రెడ్డిశేఖర్ వారి కమిటీ సభ్యులు తెలియజేసారు. సుండుపల్లె మండల అధ్య క్షుడుగా ఎన్నికైనతరువాత ఇక్కడికి రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ టీడీపీ యూత్ కువైట్ అధ్యక్షుడు ప ఠాన్ ఖాదర్ ఖాన్,జనసేన కువైట్ అధ్యక్షులు యర్రం శెట్టి హరి రాయల్, పృథ్వి రాజు,కాదురున్,మస్తాన్,మొహ్మద్ అలీ,వేణు రాజు,అచ్చుకట్ల పెద్దనగూ రు, తిరుపతి రాజు, వేణు రాజు, నాగేంద్ర, సహదేవ, జిలాన్ భాషా, ఆచారి, అనీఫ్, నాగేంద్ర ప్రసాద్ , శ్రీనివాస్ రాజు, స్పైసీ రెస్టారెంట్ యజమాని లక్ష్మి రెడ్డి,సుంకర నరేష్ ఆత్మీయంగా కలుసుకోవడం ఎంతో ఆనందంగా అనిపిం చింది. ఈ సందర్భంగా అందరం కలిసి చప్పిడి రమేష్ పూల బొకేలతో సత్క రించి పలు సామాజిక, రాజకీయ, గ్రామాభివృద్ధి విషయాలపై హృదయ పూర్వకంగా చర్చించుకోవడం జరిగింది.

## స్వచ్ఛందంగా మెడికల్ షాపుల బంద్

ముద్దనూరు, మే 20 ప్రభాతవార్త:



దేశ వ్యాప్తంగా బుధవా రం నిర్వహిస్తున్న మెడికల్ షాపుల సమ్మెలో భాగంగా పట్టణంలో పలుచోట్ల షా పులు మూసివేశారు. ఆన్లైన్ మందుల విక్రయాల ని యంత్రణ, నకిలీ మందు లపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కార్యాలయం నందు ఎమ్మార్వో అలీఖాన్‌కు వినతి పత్రం అందజేసి డిమాండ్ పరిష్కరించాలని ఈ బంద్ చేపట్టినట్లు వ్యాపారులు తెలిపారు. ఆన్లై న్‌లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ, కోవిడ్ సమయంలో కేంద్రం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ఆన్లైన్లో నకిలీ, ప్రమాదకర మం దులు సరఫరా చేస్తున్నారని, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఆన్లైన్ సేవలను నిలిపి వేయాలని వారి డిమాండ్లలో పేర్కొన్నారు.ముద్దనూరు పట్టణంలోని అన్ని మెడికల్ షాపులను యజమానులు స్వచ్ఛందంగా మూసివేశారు. బంద్ ప్రశాం త వాతావరణంలో జరుగుతోందని, దీనికి మెడికల్ షాపుల యజమానులు మ ద్దతు పలికారన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర, లక్ష్మి కుమార్, చంద్ర, ఓబు లేసు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మందుల విక్రయాలు నిలిపివేయాలి

నందలూరు, మే 20 ప్రభాతవార్త :




అఖిల భారత కెమిస్టు లు సమాఖ్య పిలుపు మే రకు బుధవారం నందలూ రులో మెడికల్ షాపుల బంద్ విజయవంతంగా ని ర్వహించారు. నందలూరు మెడికల్ షాపుల అసోసి యేషన్ అధ్యక్షుడు అరిగె సుబ్రహ్మణ్యం నేతృత్వం లో పట్టణంలోని మెడికల్ షాపులను మూసివేసి నిరసన చేపట్టారు. నాగి రెడ్డిపల్లి నుంచి ర్యాలీ నిర్వహించిన వ్యాపారులు ఆన్‌లైన్‌లో మందుల విక్రయా లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ల కారణంగా చిన్న మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ మందుల విక్రయాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.బంద్ కారణంగా రోగులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, ప్రజలు తమ ఉ ద్యమానికి సహకరించాలని అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అనం తరం నందలూరు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సుబ్బు, నాగేంద్ర, వేణు, షఫీ, సురేష్, విశ్వం, జిలాని, ప్రసాద్, సుభాన్ తది తరులు పాల్గొన్నారు.

## మహానాడు విజయవంతం చేద్దాం

సిద్ధవటం, మే 20 ప్రభాతవార్త



మహానాడు కార్యక్రమాన్ని అందరము కలిసికట్టుగా విజ యవంతం చేద్దామని టిడిపి మండల అధ్యక్షులు రాజశే ఖర్ తెలిపారు మండల కేం ద్రమైన సిద్ధవటం లోని టిడి పి కార్యాలయంలో బుధవా రం ఆయన మాట్లాడుతూ మే 27, 28, తేదీలలో జరిగే మహానాడు కార్యక్ర మాన్ని ఒక పండుగ వాతావరణం లో అందరం కలిసికట్టుగా మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని తెలిపారు. పార్లమెంటు ఉపాధ్యక్షులు నాగ ముని రెడ్డి మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ చమ ర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల ప్రకారం గ్రామస్థాయి నుండ ప్రతి టిడిపి కా ర్యకర్త మహానాడు కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రాజశేఖర్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగ ముని రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రతినిధి పార్ల శ్రీనివాసులు పా ల్గొన్నారు.

26.27న కోర్టులో గంగమ్మ జాతర

## వైభవంగా నిర్వహించనున్న నిర్వాహకులు

మదనపల్లె, మే 20 ప్రభాతవార్త :



పట్టణంలోని కోర్టులో గంగమ్మ జాతర ఈనెల 26న మంగళవారం, 27న బుధవారం రెండు రోజులు పాటు జాతర వైభవంగా జరగనున్నది. జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు గత పదిరోజులుగా పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తు న్నారు. ఆలయంతో పాటు కోర్టు ప్రాంగణం, బి కెపల్లి పట్టణమంతా విద్యుత్ దీపాలతో అలం కరణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి దున్నపోతుకు ఇంటింటా పూజలు నిర్వహిస్తున్నారు. జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. బుధవారం పగలు తిరుణాల జరగనున్నది. ప్రతి ఏటా కోర్టులో గంగమ్మ జాతర అత్యంత వైభవంగా జరు గుతుంది. వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తారు. స్తానిక ప్రజాప్రతినిధులతో పాటు పలువురిని జాతరకు రావా ల్సిందిగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆహ్వానించారు. భక్తులు జాతర సంద ర్భంగా దీలు బోణాలు పట్టి అమ్మవారి వద్ద మొక్కులు తీర్చుకోనున్నారు.

## మే 23న జాబ్ మేళా నిర్వహణ

పీలేరు, మే 20 ప్రభాతవార్త:



నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 2026 మే 23వ తేదీ ఉదయం 9.00 గంటలకు ప్రభుత్వ ఐటీఐ, పీలేరు ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఏదేని డిగ్రీ, డిప్లొమా, ఇంటర్మీడియట్, ఐ.టి.ఐ, ఎస్.ఎస్.సి అర్హత కలిగిన పురుషులు మరియు మహిళలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యా ధృవపత్రాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పాన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9949419776, 9666260646 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## టీడీపీ జోనల్ కోఆర్డినేటర్‌కు స్వాగతం

బద్వేలు, మే 20, ప్రభాతవార్త



నియోజకవర్గానికి విచ్చే సిన తెలుగుదేశం పార్టీ జోన ల్ కోఆర్డినేటర్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి బద్వేల్ ని యోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కె. రితేష్ రెడ్డి మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బద్వేల్ ని యోజకవర్గంలో పార్టీ బలోపేతం, రాబోయే రోజుల్లో చేపట్టనున్న సేవా కార్య క్రమాలు, అలాగే కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత స మర్థవంతంగా తీసుకెళ్లే అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. నియో జకవర్గ అభివృద్ధికి, పార్టీ క్యాడర్ బలోపేతానికి సమిష్టిగా కృషి చేస్తామని నా యకులు స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాల లబ్ధి చేరేలా క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, అనుబంధ సం ఘాల ప్రతినిధులు, కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆన్లైన్లో మందుల అమ్మకాలు నిలిపివేయాలి

లక్కిరెడ్డిపల్లి: మే 20 ప్రభాతవార్త




ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ షాప్ యాజమాన్యం

ఆన్లైన్లో మందులు అ మ్మకాలను నిలిపివేయా లని అన్నమయ్య జిల్లా డ్రగ్స్ అసోసియేషన్ కార్యదర్శి ఫరీద్ బా బా పేర్కొన్నారు. కె మిస్ట్రీ అండ్ డ్రగ్స్ అ సోసియేషన్ వారి ఆధ్వ ర్యంలో దేశవ్యాప్త స మ్మెలో భాగంగా బుధవారం లక్కిరెడ్డిపల్లి లోని మెడికల్ షాపులు స్వచ్ఛం దంగా మూత వేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫరీద్ బాబా మా ట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే నకిలీ మందులు విక్రయాలను ని వారించి జిఎస్సార్ 220 ఉత్తరాలను ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈ సభ్యులు రోగులు కలిగే అసౌకర్యానికి మెడికల్ షాప్ యజమానులు వి చారిస్తున్నామని కోసం ప్రజల ఆరోగ్యం భద్రత కోసం ఈ నిర్ణయాలు తీసు కోవడం తప్పు లేదన్నారు. కావున మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని వారు డిమాండ్లపై అనంతరం తాసిల్దార్ క్రాంతి కు మార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జగన్మోహన్ రెడ్డి, సంపత్, దర్బార్ భాష, రవి, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

## పీజీ ఆర్ఎస్‌పై గిరిజనులు అవగాహన కలిగి ఉండాలి

లక్కిరెడ్డిపల్లి: మే 20 ప్రభాతవార్త



గిరిజనుల నుంచి అర్జీలు సేకరిస్తున్న అధికారులు

పీజీ ఆర్ఎస్ పై గిరి జనులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీ డీవో రెడ్డయ్య పేర్కొ న్నారు. జన్ భాగేదా రి సబ్ సే దూర్ సబ్సే పహలే కార్యక్రమం గిరి జనుల అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి వారిని అభివృద్ధి బాటలో నడిపిం చేందుకు అన్ని సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. అలాగే ఎక్కడైనా మారు మూల ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను గుర్తించి వారు అభివృద్ధికి అధికారులు తోడ్పడాలన్నారు. అనంతరం గిరిజనుల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ క్రాంతికుమార్, డిప్యూటీ ఎంపీడీవో ఉషారాణి, జి ఎస్డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్ బాబు, నీతి అభియోగ కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, ఏపీఎం నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజల్ ధరలు తగ్గించాలి

కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్

మదనపల్లె, మే 20 ప్రభాతవార్త :



పెంచిన పెట్రోల్, డీజల్ ధరలు తగ్గించాలని కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎస్. రెడ్డిసాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగింపు తరువాత కేంద్ర ప్రభుత్వం డీజల్, పెట్రోల్ ధరలను పెంచి సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తొందన్నారు. ఈ రెండింటిపై ధరలు పెంచడం వల్ల ప్రతి వస్తువుపైన ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు కోలుకోలేని పరిస్థితిల్లో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమైనా స్పందించి పెంచిన డీజల్, పెట్రోల్ ధరలను తగ్గించి సామాన్య ప్రజలను ఆదుకోవాలన్నారు. బిజె పి కనుసన్నుల్లో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్ళు అవుతున్నా ఇంతవరకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలు కూడా ప్రకటనలకే పరిమితం అయ్యాయన్నారు. పెంచిన పెట్రోల్ డీజల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమిస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే తగిన బుద్ధిచెప్పే సమయం త్వరలోనే వస్తుందన్నారు.

## ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పీలేరు, మే 20 ప్రభాతవార్త:

ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (జి.ఐ.టి.ఐ), పీలేరు లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ పి. నారాయణ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 2026 జూన్ 30వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను iti.ap.gov.in పోర్టల్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 2026 జూలై 8వ తేదీ ఉదయం 9.00 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించబడుతుందని వెల్లడించారు. అనంతరం అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, పీలేరు నందు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రవేశాలకు హాజరయ్యే విద్యార్థులు ఎస్.ఎస్.సి ఒరిజినల్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఈమెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తదితర వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

## వంక కబ్జాపై దుష్ప్రచారం మాత్రమే

ఏఎంసి ఛైర్మెన్ జంగాల శివరామ్

మదనపల్లె, మే 20 ప్రభాతవార్త :

వంక కబ్జాపై దుష్ప్రచారం మాత్రమేనని మదనపల్లె మార్కెట్‌యార్డు ఛైర్మె న్ జంగాల శివరామ్ తెలిపారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఎస్‌పి నాయకు లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వారికి మార్కెట్‌యార్డులో కాం ట్రాక్టు దక్కలేదనే అక్కసుతో తనపై లేనిపోని భూ ఆరోపణలు చేస్తున్నారన్నా రు. ఒక్కసారి రూ.2కోట్లని, మరోసారి రూ.70లక్షలు అని మాట్లాడుతున్నార న్నారు. బిఎస్‌పి నాయకులు తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. మదనపల్లె కలెక్టరేట్, రాయచోటి వద్ద వారు ప్రెస్‌మీట్‌లు పెట్టి తనపై లేనిపోని ఆరో పణలు చేయడం సమంజసం కాదన్నారు. బిఎస్‌పి పార్టీని అడ్డం పెట్టుకొని ఇ లా చేయడం సమంజసం కాదన్నారు. వంక భూమిపై ఒక్క అడుగు కూడా ఆక్రమించలేదని రెవెన్యూ అధికారులే సర్వేచేసి తేల్చడం జరిగిందన్నారు. నిజా నిజాలు, వాస్తవాలు త్వరలోనే బయటకు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్లు రోను రుణబాబు, గద్దం లక్ష్మీపతి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసి ఛైర్మెన్

# జిల్లా సమగ్రాభివృద్దే లక్ష్యంగా పనిచేద్దాం

సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

మదనపల్లె, మే 20 ప్రభాతవార్త :




సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రమైన మదనప ల్లెలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగిం ది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలను క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశీలించి అధికారుల దృష్టికి తీసు కెళ్లి పరిష్కరించాలన్నారు. రైతులకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారం భించిన హంద్రీ-నీవా సుజల స్రవంతి జలాలు పారకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భజలాలు అడుగంటిపోవడంతో రైతులకు సా గునీరు అందకపోవడంతో తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. హంద్రీ-నీవా కాలువలో నీరు పారేలా సిపిఎం ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో సాగు, తాగునీటి సమస్య పరిష్కారానికి కూడా ఉద్యమించాల న్నారు. పెండింగ్‌లో ఉన్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి చే యాలన్నారు. కడప -బెంగుళూరు రైల్వేలైన్ హామీలకే పరిమితం అయ్యా యన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ పోరాట ఉద్యమం చేయాల్సి ఉందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, రామాంజులు, ప్రభాకర్‌రెడ్డి, సుధీర్, ఓబులమ్మ, వెంకటాచలపతి, వెంకటరమణారెడ్డి తది తరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల కరపత్రాల విడుదల

పీలేరు మే 20 ప్రభాతవార్త:

అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలోని భాస్కర్ ఐటీఐ కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతుల కరపత్రాలను జిల్లా కార్యదర్శి కె. మాధవ్ విడుదల చేశారు. ఈ శిక్షణా తరగతులు జూన్ 9, 10 తేదీలలో జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి ల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థి ప్రతినిధులు, నాయకులు పాల్గొని విద్యారంగ సమస్యలు, నూతన విద్యావిధానం, విద్యా రంగ కార్పొరేటీకరణ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వంటి కీలక అంశాలపై చర్చిం చనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ శక్తుల ఆధీనంలోకి నెట్టే విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థుల్లో చైతన్యం కల్పించడమే శిక్షణా తరగతుల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. అదేవిధంగా దేశంలో, రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, యువతను మత్తు పదార్థాల బారిన పడేస్తున్న పరిస్థితులపై కూడా ఈ శిక్షణా తరగతుల్లో విస్తృత చర్చ జరగనుందని తెలి పారు. సమాజంలో పెరుగుతున్న సామాజిక సమస్యలపై విద్యార్థి యువత చైతన్యవంతంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. యువతను చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచి, శాస్త్రీయ దృక్పథంతో సమాజ ని ర్మాణంలో భాగస్వాములను చేయడంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని నా యకులు పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతం, జిల్లాలో విద్యా వసతుల విస్తరణ కోసం ఏఐఎస్ఎఫ్ మరింత ఉద్య మాత్మకంగా పనిచేస్తుందని నాయకులు తెలిపారు. ఈ శిక్షణా తరగతులు భవిష్యత్ విద్యార్థి ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డా రు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు డి. తరుణ్, పీలేరు ని యోజకవర్గ నాయకులు టీ. తరుణ్, నవదీప్, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాల ఆవిష్కరిస్తున్న దృశ్యం

# ఆర్టీసీ ఎన్ఎంయుఏ డిపో సిబ్బంది హక్కుల కోసం పోరాటం

మైదుకూరు, మే 20, ప్రభాతవార్త:

ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎంయుఏ మైదుకూరు డిపో ఉద్యోగుల హక్కులకోసం న్యాయపోరాటం చేస్తున్నా రు. ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లడానికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియే షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 2 రోజులు నిర సన లో భాగంగా డిపో నందు గేట్ మీటింగ్ లో డిపో సెక్రటరీ బి.ఎస్. రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ ఎస్. నాగరాజు ఆధ్వర్యంలో డిపో నాయకులు మా ట్లాడుతూ ఆర్టీసీ ప్రవేశ పెడుతున్న విద్యుత్ బస్సు లను అద్దె విధానంలో కాకుండా ప్రభుత్వం ద్వా రానే కొనుగోలుచేయాలని,75 సంవత్సరాల ఆర్టీసీ ప్రస్థానంలో ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా బ స్సుల నిర్వహణ బాధ్యతను పూర్తిగా ప్రైవేట్ వారికి అప్పగించాలని నిర్ణయం తీసుకోవడం సరైంది కా దన్నారు. స్త్రీ శక్తి బస్సులలో జీరో టికెట్ ఇచ్చే విధానాన్ని నిలిపి వేసి మిగతా ప్రయాణికులకు టికె ట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తద్వారా సిబ్బందిపై భారం తగ్గించాలని కోరారు. పిఆర్ సి కమిటీని నియమించి ఐఆర్ ను వెంటనేప్రకటిం చాలి. పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏలు ఆరి యర్స్ మరియు లీవ్ ఎన్ క్యాష్ మెంట్లు ఇవ్వాలి. తేదీ 130526 న ప్రభుత్వానికి మరియు ఎండికి ఇచ్చిన మెమొరాండంలోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి. ప్రయాణికులకు సరిపడా కొత్త బ స్సులు వెంటనే కొనుగోలు, కేటగిరీలో ఖాళీలను భర్తీ, రిటైర్ అయి చనిపోయిన సిబ్బందికి వెంటనే సెటిల్మెంట్, ఏపిపిటిటిడి ఉద్యోగులకు ఈ హెచ్ ఎస్ నుండి మినహాయించి గతంలో ఆర్టీసీ నందు ఉన్న వైద్య సదుపాయం అమలుచేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

మదనపల్లె క్రైమ్, మే 20 ప్రభాతవార్త.



ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం సాయంత్రం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మదన పల్లె పట్టణం, బుగ్గ కాలువకు చెంది న వ్యవసాయ కూలీలు ఆషారాణి, జ్యోతి, లక్ష్మమ్మ, రెడ్డమ్మ లు ని మ్మనపల్లి మండలం, సైదాపేటలో ఉన్న మామిడి తోటలో మామిడికాయలు కోసేందుకు కూలికి వెళ్లారు. సాయం త్రం పనులు ముగించుకుని ఆటోలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమ య్యారు. మార్గమధ్యంలోని పెట్టావాండ్లపల్లి వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. గ మనించిన స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తర లించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పో లీసులు విచారణ చేస్తున్నారు.

## ఖరీఫ్‌లో రైతులకు అందుబాటులో ఉండండి

తంబళ్లపల్లె మే 20 ప్రభాతవార్త ః



ఖరీఫ్ సీజన్లో గ్రామ వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి అంతస్తు వ్యవసా య సూచనలు ఇవ్వడా నికి అందుబాటులో ఉం డాలని జిల్లా వ్యవసాయ అధికారి శివ నారాయణ సూచించారు. బుధవారం తంబళ్లపల్లె ఆర్బికే లో ఏఈఓ లతో సమీక్ష నిర్వహించారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం పై ఆసక్తి పెంచాలన్నారు. వ్యవసాయ భూముల దుక్కి నుండి వేరుశనగ విత్తన కాయలు పంపిణీ వరకు సచివాలయ స్థాయిలో రైతులకు వ్యవసాయం పైక్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఏపీ ఎఫ్ ఆర్ 11 అంకెలు నమోదు, ఏపీఎంసీ యాప్ ద్వారా వ్యవసాయ సలహాలు సూ చనలు అందివ్వాలని తెలిపారు. రైతులకు వ్యవసాయ పరికరాలు ఎస్సీ ఎస్టీ, సన్న కారు రైతులకు 50!! సబ్సిడీ, జనరల్ రైతులకు 40 శాతం సబ్సిడీతో అందివ్వడానికి గడువు మరో అయిదు రోజులు పెంచిన విషయాన్ని రైతుల దృష్టికి తీసుకెళ్లి సహకరించాలన్నారు. ఏపీ ఎఫ్ ఆర్ సరాసరి 3000 మంది రిజిస్ట్రేషన్ చేయించాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు ముందస్తు వ్యవ సాయ సూచనలు, సలహాలు పాటించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట ఏవో రమణకుమార్, ఏఈఓ సురేష్, మండలంలో గ్రామ వ్య వసాయ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేటర్లు విలేజ్ మ్యాప్‌లు సిద్ధం చేయాలి

తంబళ్లపల్లె మే 20 ప్రభాతవార్త ః

ఎన్యుమలేటర్లు ఓటర్ల నమోదు తో పాటు విలేజ్ మ్యాపులు సిద్ధం చేయా లని ఎంపీడీవో ఎంపీ ప్రసాద్ సూచించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలోకు ఎన్ని మలేటర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఓటర్ నమోదు కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడ ఏ సమ స్య వచ్చినా వెంటనే సూపర్వైజర్లు దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఓటర్ల నమోదు కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని ఎలాంటి లోటుపాట్లు లేకుండా నికాసైన ఓటర్ల జాబితాకు ప్రతి ఒక్కరు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ముద్దుకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో మారుతీ కుమార్, మండలంలోని సూపర్వైజర్లు, ఎన్యుమలేటర్లు పాల్గొన్నారు.



## వేసవి విజ్ఞాన శిబిరాల్లో సంగీతంపై శిక్షణ



చాపాడు. మే 20.ప్రభాతవార్త :

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలలో భాగంగాస్థానిక గ్రంథాలయమ నందు గ్రం థాలయ అధికారి జొన్నవరం శివశంకర్ రెడ్డి విద్యార్థులకు సంగీతంపై శిక్షణ వాయిద్య పరికరాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సప్తస్వ రాలు అనగా 7 అని సరిగమపదని. అది ఎలా పుట్టుకొచ్చాయో వాటి ధ్వని పక్షులు, జంతువుల ద్వారా ఎలా ఉద్భవించిందో వివరించారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థులకు వివరించారు.

## నుంజార్లపల్లికి మహిళకు దక్కిన అరుదైన గౌరవం

-రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా సోమాజ దేవతనేని

చౌడేపల్లి, మే 20 ప్రభాతవార్త



మండలంలోని పరికిదొన పంచాయతీ నుంజా ర్లపల్లికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త సో మాజ దేవతనేనికి అరుదైన గౌరవం దక్కింది. తె దేపా ప్రొఫషనల్ వింగ్ రాష్ట్ర కార్యనిర్వాహక కా ర్యదర్శి దేవతనేని సునీల్‌కుమార్ సతీమణి అయి న ఆమెను ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఫర్ ఎస్సీ, ఎస్టీ, ఉమెన్ ఎంటర్ ప్రైజెస్ ఏపి రాష్ట్ర మహిళా విభాగంలో ఉపాధ్యక్షురాలుగా నియమితులయ్యింది. ఈమేరకు ఐసీసీఎస్‌డబ్ల్యుఈ జాతీయ సంయుక్త కార్యదర్శి(అడ్మిన్) సీమా కిరణ్ ఢిల్లీలోని ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని మహిళా పారిశ్రామిక వేత్తల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా ని యమితులైన సోమాజ దేవతనేని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర పదవి నందించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సోమాజ దేవత నేని నియామకం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు హర్షం వ్యక్తం చేసారు.

## ఆన్‌లైన్‌లో ఔషదాల విక్రయాలు రద్దు పరచాలి

-నిరసన తెలిపిన దుకాణదారులు

చౌడేపల్లి, మే 20 ప్రభాతవార్త

నియంత్రణ లేని ఆన్‌లైన్ ఔషదాల విక్రయాలు, ఈ-ఫార్మసీ అక్రమదం దాకు వ్యతిరేకంగా ఎఐఒసిడి పిలుపు మేరకు చేపట్టిన దేశవ్యాప్త నిరసనకు స్థానిక దుకాణదారులు మద్దతు పలుకుతూ కార్యక్రమాన్ని చేపట్టారు. మెడికల్ షాపులను మూసివేసి తమ నిరసన గళాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు రాజేష్, లోకేష్‌లు ప్రసంగిస్తూ ఆన్‌లైన్ల ద్వారా నియంత్రణ లేని విక్రయాలు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల నకిలీ ఔషదాల ముప్పు వుందనీ, ప్రజారోగ్యం పూర్తి దెబ్బతినే అవకాశముందన్నారు. ఈ-ఫార్మసీ లిస్తున్న భారీ డిస్కౌంట్లకు ప్రజలు ఆకర్షిలవుతున్నారనీ, దీనివల్ల వైద్యుడి రసీ దును పాతవే చూపి మత్తు కల్గించే మందులను సులభంగా పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆన్‌లైన్ మందుల అమ్మకాలకు కేంద్ర ప్రభుత్వ నిబంధన జీఎస్సార్ 817ఉపసంహరించుకొని, కోవిడ్ మహమ్మారి సమయంలో మందుల హోమ్ డెలివరీ కోసం సడలించిన తాత్కాలిక నిబం ధలను జీఎస్సార్ 220 పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేసారు. ఎఆర్ రమేష్, జితేంద్ర, ప్రకాష్, అశోకా, కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మెడికల్ దుకాణ యజమానులు

# వెల్లటూరులో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన

పెండ్లిమర్రి, మే 20, ప్రభాతవార్త:
పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు గ్రామంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు ఆధ్వర్యంలో మేకపాటి వ్యవసాయ కళాశాల, ఉదయగిరికి చెందిన 4వ ఏడాది విద్యార్థులు రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శనను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా.జి.కృష్ణారెడ్డి, (అసోసియేట్ డీన్, శ్రీ మేకపాటి వ్యవసాయ కళాశాల ఉదయగిరి) మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు గత 3 సంవత్సరాలుగా తరగతి గదిలో చదవిన అంశాలను ప్రత్యక్షంగా రైతుల పొలాలలో పరిశీలించడానికి మరియు రైతులతో ఆచరింపజేయడానికి మంచి ప్రయోజనకరంగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. భూసార పరీక్షలు, జీవన ఎరువులు, విత్తనశుద్ధి వంటి అంశాలు కొన్ని దశాబ్దాలుగా వివరిస్తున్న రైతు సోదరులు ఇంకా ఆచరించడం లేదని కావునా మారిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఖర్చును తగ్గించుకొనే పద్ధతులను పాటించి అధిక దిగుబడులను ఆదాయాన్ని పొందాలని తెలిపారు. మార్కెట్ ధరల సమాచారం కోసం వ్యవసాయ విశ్వవిద్యాలయం అందించే పంట ధరల ముందస్తు అంచనా ధరల సమాచారాన్ని ఉపయోగించుకొని మంచి మార్కెట్ ధరకు తమ ఉత్పత్తులను అమ్ముకోవాలన్నారు. విస్తరణ శాస్త్రవేత్త డా.టి.మహేష్‌బాబు మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా సమతుల్యమైన ఎరువులు వాడకం చేపట్టాలని సమతుల్యమైన ఎరువుల వాడకంలో కేవలం 75 శాతం మాత్రమే రసాయనిక ఎరువులను వాడాలని మిగతా 25 శాతం జీవన ఎరువులు, సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్టె ఎరువులు వంటివి వాడకం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ మరియు ఆర్థిక వ్యవస్థను కూడా కాపాడవచ్చన్నారు. పెండ్లిమర్రి వ్యవసాయాధికారి డా.బి.అరవింద్ నాయక్ మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందున సేంద్రియ సర్టిఫికేషన్ చేసుకోవడం వలన అధిక ధరలు మరియు విస్తృత మార్కెట్ ప్రయోజనాలు పొందవచ్చన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా రైతు పండగను ఈ నెల 22వ తేదీ నుంచి 24 వరకు నిర్వహిస్తున్న అందుకోసం రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. శాస్త్రవేత్త డా.వి.మాధురి మాట్లాడుతూ మార్కెట్ సమస్యను అధిగమించడానికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలలో చేరి వాటిని బలోపేతం చేయాలని తద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. డా.ఎస్.మానస మాట్లాడుతూ చామంతి, మల్లె, చీనీ, నిమ్మ పంటలలో పోషకాల యాజమాన్యం మరియు చీడపీడల యాజమాన్యం, తెగుళ్ల గురించి సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమీకృత వ్యవసాయ పద్ధతులు, నేల మరియు నీటి సంరక్షణ పద్ధతులు, సోలార్ పెన్సింగ్ వంటి అంశాలపై ప్రతిమలను, విత్తనాలను, చార్టులను, మోడల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరీష్‌కుమార్, యువ నిపుణులు, వ్యవసాయ కళాశాల ఉదయగిరికి చెందిన 18 మంది విద్యార్థినీ విద్యార్థులు, వెల్లటూరు, చెన్నంరాజుపల్లి, సలాబాద్, ఇప్పెంట గ్రామాలకు చెందిన 90 మంది రైతులు పాల్గొన్నారు.




# పురపాలిక స్థలాలపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

పార్కును ఎవరు అన్యాక్రాంతం చేయలేదు

సౌకర్యాల కోసమే షెడ్ నిర్మాణం

విజయహోమ్స్ కమిటీ సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న విజయ హోమ్స్ కమిటీ సభ్యులు

పులివెందుల మే 20 ప్రభాతవార్త :
పులివెందుల పురపాలక శాఖ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయంటూ కొన్ని వర్గాలు ప్రచారం చేస్తున్న వార్తలు పూర్తిగాఅవాస్తవమని విజయ హోమ్స్ ప్రెసిడెంట్ వీరారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వైయస్ వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీ మురళి, వైస్ ప్రెసిడెంట్ కే రామచంద్రారెడ్డి, ట్రెజరర్ రామాంజనేయులు రెడ్డి, జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ,సోమేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిలు స్పష్టం చేశారు. పట్టణంలోని విజయ హోమ్స్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ పురపాలక స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు ప్రా గావేశారని తప్పుడు ప్రచారం జరుగుతోంది అని అన్నారు. విజయ హోమ్స్ పరిధిలో పురపాలక శాఖ సంబం ధించిన ఆస్తిని ఎవరు కబ్జా చేయలేదన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కే వేలమారి పల్లె గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 48 ఏ లో విజయ హోమ్స్ లే అవుట్ యజమానులు మున్సిపాలిటీ కి గతంలోఅభివృద్ధి కోసం ఒక ఎకరా 62 పార్కుల కోసం సెంట్లు స్థలం ఇవ్వడం జరిగిందని, అందులో మున్సిపాలిటీ వారు జిమ్ము పరికరాలు, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విజయ హోమ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ కేవలం వాకింగ్ చేసే వారికి టాయిలెట్స్ వంటి సమస్యల పరిష్కారం కోసం సొంత నిధులతో కట్టించడం జరిగిందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించు కునేందుకు డ్రెస్ లు మార్చుకోవడానికి ఒక సెంటు స్థలంలో ఒకరేకుల షెడ్డు 3 లక్షల రూపాయలు వేయంతో నిర్మించడం జరిగిందన్నారు. ఈ పార్కులో వాకింగ్ చేసే టైంలో వర్షాలు పడినప్పుడు గానీ లేదా కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి ఉపయోగించుకోవడం కోసం అప్పటి మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి కి సమాచారం ఇచ్చే నిర్మించడం జరిగింది అన్నారు .. ఇది కేవలం మున్సిపాలిటీకి సంబంధించిన స్థలమే కానీ ఎవరు ఇక్కడ కబ్జా చేయలేదని వారన్నారు. ప్రభుత్వానికి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేయాల్సిన అవసరం ఎవరికీ లేదని వారన్నారు. ఈ స్థలంలో పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన బోర్డు కూడా అలానే ఉందని అలాంటి స్థలాన్ని ఎలా ఆక్రమిస్తారని వారన్నారు. ఆ స్థలానికి ప్రభుత్వం వారు చుట్టూ కాంపౌండ్ కూడా నిర్మించడం కూడా జరిగిందన్నారు. అలాంటి స్థలాన్ని ఎలా ఆక్రమించుతారని వారన్నారు. అధికారులు వచ్చి ఒక సారి పరిశీలిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని వారన్నారు.కాలనీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లు, సౌకర్యాలను అక్రమ నిర్మాణాలుగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం మాత్రమే ఆ ప్రదేశాన్ని వినియోగి స్తున్నారని వివరించారు. పురపాలక స్థలాల్లో ఎలాంటి శాశ్వత అక్రమ నిర్మాణాలకు అనుమతులు లేవని, ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకునే విధంగా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. కొన్ని రాజకీయ మరియు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పురపాలక శాఖ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని అధికారులు ఆరోపించారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా నిరాధార ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అన్నారు.

# రెడ్ బుక్ రాజ్యాంగానికి భయపడేది లేదు : ఎంపీ అవినాష్ రెడ్డి

పులివెందుల, మే 20 , ప్రభాతవార్త :
అధికార ప్రభుత్వం కక్షపూరి తంగా వ్యవహరిస్తూ పోలీసులను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ ఎవ్వరూ భయపడల్సిన అవసరం లేదని వైయస్ అవినాష్ రెడ్డి అన్నారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం వైసీపీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.బుధవారం స్థానిక జగన్ క్యాంపు కార్యాలయం లో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సాగు సమస్యలు, పంటలకు సరైన ధరలు లేకపోవడం వంటి అంశాలను ఎంపీకి వివరించారు. ఈ సందర్భంగా బద్వేల్‌లో చెందిన వైసీపీ ముఖ్య కార్యకర్తలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే ఆరోపణలతో గుంటూరు పోలీసులు రాత్రికి రాత్రే అరెస్టు చేసిన విషయాన్ని పార్టీ నాయకులు ఎంపీ అవినాష్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకుని కార్యకర్తల విడుదలకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,"రెడ్ బుక్ రాజ్యాంగానికి ఎవ్వరూ భయపడవద్దు అని అధికార పార్టీ వైసీపీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసే దానికి తప్పుడు కేసులు పెడుతోందని ఎలాంటి ఇబ్బందులు ఎదురైన వెంటనే మా దృష్టికి తీసుకురాడని న్యాయ స్థానాల ద్వారా పోరాడి న్యాయం జరిగేలా చూస్తాం" అని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కా రానికి కూడా పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజా వ్యతిరేక పాలనకు ప్రజలే చంమగీతం పాడతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ కార్యకర్తలకు అండగా నిలుస్తారని తెలిపారు.ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## జనగణన పై సమీక్ష

దువ్వూరు, మే 20, ప్రభాతవార్త:
మండలంలో జరుగుతున్న జనగణన కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభా భవన్ లో బుధవారం తహసీల్దార్ సంజీవరెడ్డి, ఎంపీడీవో సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జనగణనకు సంబంధించిన ఎన్యూమినేటర్లు, సూపర్వైజర్లకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఇండ్ల గణన, ఇళ్ల జాబితా తయారీలో తాళం వేయబడిన గృహాలను, ఖాళీగా ఉంచి వేయబడిన గృహాలను మరోసారి సర్వే చేయాలన్నారు. సర్వే చేస్తే ఆ గృహాలకు సంబంధించిన వ్యక్తులు ఎవరైనా పక్క రాష్ట్రాలలో ఉన్నారా, విదేశాల్లో ఉన్నారా అనే విషయాలను కూడా సేకరించవలసి ఉందన్నారు. 2011 తర్వాత ప్రస్తుతం జనగణన చేస్తున్నామని గృహాల సంఖ్య, అలాగే జనాభా సంఖ్య పెరగవలసి ఉందని కొన్ని ప్రాంతాల్లో తగ్గడంతో ఈ జాబితాను మరోసారి పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ హరిప్రసాద్, ఏపీఓ లక్ష్మీనారాయణ, సర్వేయర్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## వాసవి సర్కిల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

పులివెందుల, మే 20, ప్రభాత వార్త :
పులివెందుల పట్టణంలోని పార్నపల్లి బస్టాండ్ ప్రాంతాన్ని"వాసవి సర్కిల్"గా అభివృద్ధి చేసేందుకు బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థల పరిశీలన నిర్వహించారు. పులివెందుల ఆర్డీఓ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశీలనలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. వాసవి సర్కిల్ ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయా అనే అంశంపై అధికారులు పరిశీలించారు. బస్టాండ్ ప్రాంతానికి సంబంధించిన రూట్లు, ట్రాఫిక్ సౌకర్యాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండే అంశాలను పరిశీలించారు. అనంతరం సర్కిల్ ఏర్పాటుకు ఆర్డీఓ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. త్వరలోనే పార్నపల్లి బస్టాండ్‌ను"వాసవి సర్కిల్"గా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ, వాసవి మాత పేరుతో సర్కిల్ ఏర్పాటు కావడం తమ సంఘానికి గౌరవకారణమని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ సర్కిల్ ఉండబోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి సగిలా మహేంద్ర, ట్రెజరర్ రాజోలు సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు మేడ రమణయ్య, మేడ సాయిబాబా, సభ్యులు పబ్బతి దక్షిణామూర్తి, రమేష్, పద్మనాభయ్య, హరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ధ్వంసం.. వైరు చోరీ

కేవీపల్లె , మే 20 ప్రభాతవార్త:
విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని రాగివైరు చోరీ చేసిన సంఘటన మండలంలోని గాలివారిపల్లె పంచాయతీ తిప్పసముద్రం వద్ద చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. తిప్పసముద్రం వద్ద గల విద్యుత్ ట్రాన్స్ఫార్మర్న్ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని రాగివైరు చోరీ చేసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఏఈ వరప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గాంధీ సర్కిల్ వద్ద విషాదం

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

పులివెందుల, మే 20, ప్రభాత వార్త :
పులివెందుల పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొండూరు గ్రామానికి చెందిన వల్లెపు రవి ప్రసాద్ (35) అలియాస్ చంటి మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.సమాచారం మేరకు, రవి ప్రసాద్ పులివెందుల నుండి ద్విచక్ర వాహనంపై బత్తాయి కాయల సంచిని తీసుకుని తన గ్రామానికి వెళ్తుండగా గాంధీ సర్కిల్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. వాహనం స్టీరింగ్ అకస్మాత్తుగా తిరగక అదుపు తప్పడంతో ఆయన కిందపడినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో తలకు తీవ్ర రక్తగాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు సమాచారం.స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వెంటనే అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.మృతుడు రవి ప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.




# నకిలీ మందులు ఎరువులు విక్రయిస్తే చర్యలు

చౌడేపల్లి, మే 20 ప్రభాతవార్త


ప్రసంగిస్తున్న ఎడిఎ శివకుమార్

ఎరువుల దుకాణం దారులు నకిలీ మందులు, కల్తీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని పుంగనూరు వ్యవసాయశాఖ సంచాలకుడు శివకుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని ఎరువుల దుకాణ యజమానులతో సమావేశం జరిగింది. ఎరువులు, క్రిమిసంహారక మందులను ప్రభుత్వ నిర్ధేశిత నిబంధనలకు అనుగుణంగా విక్రయించాలన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించకుండా, నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతులకందించాలన్నారు. ముఖ్యంగా రైతులు తీసుకొన్ని వాటికి బిల్లులు ఇవ్వాలనీ, ఎరువులను రైతుల ఆధార్ నంబర్‌తో బయోమెట్రిక్ వేయించాలన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే డీలర్ లైసెన్సులు రద్దు పరస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి మోహన్‌కుమార్, మండలంలోని దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

# మాదిగలు చదువుకొని రిజర్వేషన్లు పొందాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు డానియల్ మాదిగ.

తంబళ్లపల్లె. మే20. ప్రభాతవార్త ః.



దశాబ్దాలుగా అణగారిన మాదిగ జాతి బిడ్డలు నేడు ప్రతి ఒక్కరు చదువుకుని పోరాటంతో సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలను పొందాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు డానియల్ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మండల అధ్యక్షుడు గంగాధర్, ఇంచార్జ్ వేటా మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటప్ప ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు 50 గోటు విలేజ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం లోని చదువుకు దూరంగా ఉన్న మాదిగ జాతి బిడ్డలను గుర్తించి స్థానికంగా గల పాఠశాలల్లో చేర్పించడంతో బాటు విద్యార్థులు, యువతి యువకులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఉద్యమంలా చేపట్టి వంద శాతం మాదిగ బిడ్డలు చదువుకుని భవిష్యత్తులో వారు ఉన్నత స్థానానికి ఎదగడానికి ఎమ్మార్పీఎస్ నాయకులు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి మండలాలు, నియోజకవర్గ ఇన్చార్జిలు కృషి చేయాలని నిరక్ష్యం చేసే వారిపై పునరాలోచన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, రాములమ్మ, రెడ్డమ్మ, ఆదినారాయణ, నరసింహులు, రెడ్డప్ప, రెడ్డప్ప నాయుడు, పెద్దన్న పాల్గొన్నారు.

# విద్యార్థులతో ఘనంగా డ్రాయింగ్ పోటీలు

సృజనాత్మకతను వెలికితీయడమే లక్ష్యం.



మైదుకూరు, మే 20, ప్రభాతవార్త:
మైదుకూరు పట్టణ ప్రొద్దుటూరు రోడ్డులోని ఇండస్ వ్యాలీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు విద్యార్థులకు ఘనంగా డ్రాయింగ్ కాంపిటీషన్ (చిత్రలేఖనం పోటీలు) నిర్వహించారు. విద్యార్థులలో దాగున్న అంతర్గత సృజనాత్మకతను, కళా నైపుణ్యాలను వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు స్కూల్ యాజమాన్యం తెలిపారు.ఈ పోటీలలో ఎల్.కె.జి నుండి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. “సరియలిజం ఫాంటసీ“ (కల్పిత అద్భుత లోకాలు), ప్రకృతి అందాలు, పర్యావరణ పరిరక్షణ, మరియు స్వచ్ఛ భారత్ వంటి విభిన్నమైన థీమ్స్‌పై పిల్లలు తమ ఊహాశక్తికి రంగులద్ది అద్భుతమైన చిత్రాలను గీశారు. ముఖ్యంగా చిన్న పిల్లలు గీసిన రంగు రంగుల చిత్రాలు, వారి అమాయ కత్వంతో కూడిన సృజనాత్మకత అక్కడి వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ కేవలం చదువు మాత్రమే కాకుండా పిల్లల్లో ఉన్న ఇలాంటి కళలను ప్రోత్సహించడం వల్ల వారి మానసిక వికాసం మెరుగుపడుతుందని, ఆలోచనా పరిధి పెరుగుతుందని పేర్కొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ బండి దస్తగిరి, శ్రీ కళ మరియు అడ్మినిస్ట్రేషన్ ఇంచార్జ్ పావని, కళ్యాణి, అస్మా, కావ్య టీచర్స్, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం ఐవిఆర్ కాల్స్‌ల్లో ప్రజలు ఒకటి నొక్కేలా పనిచేయండి

రామసముద్రం మే 20 ప్రభాతవార్త



కేసీ పల్లి గ్రామ పంచాయతీ లోని గ్రామాలలో పారిశుధ్యం పై ప్రజలు ఒకటి నొక్కేలా గ్రీన్ అంబాసిడర్లు వద్ద పనిచేయించాలని ఎంపిడిఓ 1అన్నపూర్ణ సూచించారు. బుధవారం మండలంలోని కేసీ పల్లె గ్రామపంచాయతీలో పారిశుధ్యం పై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎంపిడిఓ రాక ముందే గ్రామ పంచాయతీ కార్యదర్శి మారెప్ప గ్రీన్ అంబాసిడర్లు ద్వారా చెత్త సేకరణ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నారు, ఈ సందర్భంగా కార్యదర్శి తో పాటు గ్రీన్ అంబాసిడర్లను అభినందించారు. గ్రామ పంచాయతీ లో పారిశుధ్యం పై ద్రుష్టి సారించి స్వచ్ఛ ఆంధ్ర సాధనకు సహకరించాలన్నారు, పంచాయతీలో స్వచ్ఛ రథం పై అవగాహన పెంచి పనికి రాని వస్తువులను అప్పగించి అందుకు తగ్గ ఇంటి సరుకులు తీసుకొనేలా చూడాలన్నారు, అనంతరం డంపింగ్ యార్డ్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ తడి చెత్త ను పొడి చెత్త ను వేరు చేసి డంపింగ్ కు తరలించి ఎరువు చేపట్టాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓ 1అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి మారెప్ప, గ్రీన్ అంబాసిడర్లు ప్రజలు పాల్గొన్నారు.

# వాసుదేవరెడ్డి పార్దివ దేహానికి నివాళి

రామసముద్రం మే 20 ప్రభాతవార్త
మదనపల్లె నియోజకవర్గం రామసముద్రం మండలం రాగిమాకుల పల్లి టిడిపి నాయకుడు వాసుదేవరెడ్డి అకాల మరణం తీవ్రంగా భాదించిందని మదనపల్లె ఎమ్మెల్యే షాజాహాన్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. వాసుదేవరెడ్డి స్వగృహం నందు పార్థవదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసుదేవరెడ్డి మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని, నేను వాసుదేవారెడ్డి కుటుంబానికి ఏళ్లప్పుడూ అందుబాటులో ఉండి నావంతు సహాయ సహకారాలు అందిస్తానని,వాసుదేవారెడ్డి మృతి చెందిన విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ద్రుష్టికి తీసుకువెళతానని, టిడిపి పార్టీ ఆకుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటుందన్నారు.మండల టిడిపి అధ్యక్షులు విజయ కుమార్ గౌడ్ బుధవారం ఉదయం వాసుదేవరెడ్డి భౌతికాన్ని సందర్శించి నివాలర్పించారు. నివాళులర్పించిన ఎమ్మెల్యే షాజాహాన్ బాషా, కృష్ణంరాజు యాదవ్, గుండ్ల పల్లె శివారెడ్డి మాజీ జడ్పీటీసీ శివశంకర,నడింపల్లె రమేష్, డాక్టర్ జి. శివకుమార్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి శ్రీనివాసులు( మంత్రి),మురగన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



# నకిలీ మద్యంలో జోగి రమేష్‌దే కీలక పాత్ర

సిద్ధవటం మే 20 ప్రభాతవార్త



2018 నుండి 2025 వరకు సాగిన నకిలీ మద్యం వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేష్‌దే కీలక పాత్ర అని పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆరోపించారు. మండలంలోని మాధవరం1 పార్వతీపురం గ్రామంలో ఆయన బుధవారం మాట్లాడుతూ నకిలీ మద్యం వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేష్ కర్త, కర్మ, క్రియ గా వ్యవహరించారన్నారు. ఇదే విషయాన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా స్పష్టం చేసిందన్నారు. మాజీ మంత్రికి అత్యంత సన్నిహితుడైనా అద్దేపల్లి జనార్ధన రావు ఆయన సోదరుడు జగన్ మోహన్ రావు, నకిలీ కథను నడిపించాడని కోర్టు నివేదించారన్నారు. నకిలీ మద్యం కేసులో దర్యాప్తు పూర్తి కావడంతో సిట్ తుది చార్జి షీటును నాలుగు రోజుల క్రితం దాఖలు చేసిందన్నారు. అధికారాన్ని అడ్డపెట్టుకొని రాష్ట్ర ఖజానాకు తూట్లు పొడిచారన్నారు. తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరన్నారు. పెట్రోల్, డీజిల్ పై వైసీపీ కపటి ప్రేమను చూపిస్తుందని పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలు మన ఏపీలో పెరిగినట్లు వాళ్ళు చేస్తున్న రాజకీయాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ అన్ని రాష్ట్రాల్లో పెరిగాయని వైసీపీ కుటిల రాజకీయాలు మానుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# కార్మిక నాయకులకు శ్రమశక్తి అవార్డులు ప్రధానం



ప్రొద్దుటూరు అర్బన్ మే 20 ప్రభాతవార్త
రాష్ట్రవ్యాప్తంగా కార్మిక విభాగంలో పని చేసినటువంటి కార్మిక నాయకులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా శ్రమశక్తి అవార్డులను ప్రధానం చేశారు.ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్‌ని ముఖ్య అతిథిగా పంపించి కార్మిక నాయకులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికీ,స్థానిక ఎమ్మెల్యే వరదరాజు రెడ్డికి టిఎన్టియుసి కడప జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ ఒక ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు.

# ఏరోపాలెంలో స్వచ్ఛ పథం కార్యక్రమం

రాజుపాళెం, మే 20, ప్రభాతవార్త:



మండల పరిధిలోని ఏరోపాలెం గ్రామంలో బుధవారం ఎంపీడీవో జి.సురేష్ బాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించి వీధుల్లోని చెత్తాచెదారంను తొలగించారు. గ్రామంలోని వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలని, మురుగు కాలువల్లో పూడికని ఎప్పటికప్పుడు తీయాలని, త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో షాకీర్ అలీ ఖాన్, పంచాయతీ సెక్రటరీ సుబ్బ నారాయణరెడ్డి, గ్రామ సచివాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ షాపులు మూతవేత.

వేంపల్లె: మే 20 ప్రభాతవార్త



అఖిల భారత కెమిస్టుల సమాఖ్య ఆధ్వర్యంలో వేంపల్లె పట్టణంలో ఆల్ ఇండియా మెడికల్ స్టోర్ బంద్ సందర్భంగా వేంపల్లె పట్టణంలోని మెడికల్ షాపులు మూతవేశారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఆన్‌లైన్ మెడిషన్ విక్రయాలను నిరసిస్తూ వేంపల్లిలో మెడికల్ షాపులు మూసివేశారు. మెడికల్ షాపు యజమానులు నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.అనంతరం వేంపల్లె మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోహన్ కృష్ణ వినతిపత్రం అందజేశారు. వేంపల్లె కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సెక్రటరీ రాయవరం సుబ్బు,ఈసీ సభ్యులు సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ ఆన్లైన్లో మెడిసిన్ అమ్మకాలతో యువత డ్రగ్స్ కి బానిసలు అవుతారన్నారు. అక్రమ డిస్కౌంట్లతో ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెటుతున్నారని తెలిపారు.నకిలీ మందులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారన్నారు.నకిలీ మందుల అమ్మకాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ బంద్ నిర్వహించారు.నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వాటిని అరికట్టడానికి భారత కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ మరియు కడప జిల్లా కెమిస్ట్స్,డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శాంతియుతంగా బంద్ నిర్వహించినట్లు తెలిపారు.ప్రజలకు అత్యవసర మెడిసిన్ ఇవ్వడానికి అందుబాటులో ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రెజరర్ చంద్రమోహన్,ఈసీ సభ్యులు రాజారామ్,సాయి,రామలింగా రెడ్డి,రామాంజనేయులు,దేశం సుబ్బారెడ్డి,సతీష్, రామకృష్ణ,షాహిద్,దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ కోఆర్డినేటర్‌ను కలిసిన ఎల్ఎస్ పి డ్యామ్ చైర్మన్

బద్వేలు ,మే 20, ప్రభాతవార్త



బద్వేల్ కు బుధవారం విచ్చేసిన టిడిపి జోనల్ కోఆర్డినేటర్ పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి ని బద్వేలు ఎల్ఎస్ పి డ్యామ్ చైర్మన్ ఈగ వెంకటరమరెడ్డి ప్రత్యేకంగా కలిసి ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో రైతుల ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. రాబోయే రోజుల్లోనూ ఇలాగే పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని పార్టీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

## రాయలసీమ జోన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డిని కలిసిన ప్రసాద్

బద్వేల్ అర్బన్, మే 20 (ప్రభాత వార్త):



తెలుగుదేశం పార్టీ రాయలసీమ జోన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి ని బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ రితేష్ రెడ్డి ఆధ్వర్యంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రెటరీ, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కనమర్లపూటి శ్రీరామచంద్ర వర ప్రసాద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ మరియు వాణిజ్య విభాగం ద్వారా చేపట్టవలసిన పలు కార్యక్రమాలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శ్రీనివాసులరెడ్డి అందిస్తున్న మార్గదర్శకత్వం అభినందనీయమన్నారు. ఆయన నాయకత్వంలో బద్వేల్ నియోజకవర్గంలోనూ,జిల్లా వ్యాప్తంగానూ వాణిజ్య విభాగాన్ని మరింత క్రియాశీలకంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం శ్రీనివాసులరెడ్డి ని ప్రసాద్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇంటి సమస్యలతో యువకుడు అదృశ్యం

దువ్వూరు, మే 20, ప్రభాతవార్త:
మండల పరిధిలోని సంకటి తిమ్మాయిపల్లెకు చెందిన గంగటూరు ఖాదర్ బాషా 28 ఇంటి సమస్యలతో అదృశ్యమైనట్లు భార్య భారతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధనుంజయుడు. ఖాదర్ భాషాకు ఐదు సంవత్సరాల క్రితం పెద్దముడియం మండలానికి చెందిన భారతితో వివాహం అయింది. అతనికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల తరచూ భార్యాభర్తలు గొడవపడే వారని అలాగే ఇంటిలోని చెల్లెళ్లతో కూడా సమస్యలు రావడంతో మంగళవారం ఉదయం ఇంటిలోంచి వెళ్లిపోయినట్లు భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా...

## ప్రకృతి సేద్యం చేస్తున్న తోటను సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే

**ముద్దనూరు మే 20 ప్రభాతవార్త:**
మంత్రి లోకేష్ కొండాపురం మండలంలోని సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభానికి విచ్చేస్తున్న సందర్భంగా అనంతరం మండలంలో పెనికలపాడు గ్రామ రైతు సేవా కేంద్ర పరిధిలో ప్రకృతి సెద్యం చేస్తున్న రమణారెడ్డి ఉద్యాన తోటను పరిశీలించేందుకు విచ్చేస్తున్నాడని తెలియడంతో బుధవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, ఎస్పీ నచ్చికేత్ విశ్వనాథ్ టిడిపి జిల్లా ఇంచార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి సందర్శించారు, శుక్రవారం మంత్రి లోకేష్ విచ్చేస్తుండటంతో ముందస్తు ఏర్పాట్లలో భాగంగా రైతులుతో వారు ప్రకృతి సెద్యంలో వివిధ రకాల కష్యాయాలు, జీవామృతం, పంచకవ్య అమలు చేస్తుండటంతో వారికి వస్తున్న ఆర్థిక దిగుబడులు గురుంచి అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాలు శుక్రవారం మంత్రి లోకేష్‌తో రైతులతో ముఖాముఖిలో అడిగి తెలుసుకోనున్నారు. ఇందులో ఏర్పాట్లలో భాగంగా రైతు యొక్క తోటను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఎమ్మార్వో అలీ ఖాన్, ఎంపీడీవో రాధాకృష్ణ వేణి, ఏడిఏ రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి వెంకటకృష్ణారెడ్డి, ఆర్టికల్చర్ మల్లేశ్వర్ రెడ్డి, సీఐ నగేష్ బాబు మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



## కలికిరిలో స్వచ్ఛపథం విజయవంతం

**కలికిరి, మే 20, ప్రభాతవార్త:**
కలికిరి మేజర్ పంచాయతీలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలికిరి మేజర్ పంచాయతీ స్పెషలాఫీసర్, కలికిరి ఎంపీడీవో భానుమూర్తిరావు, కలికిరి మేజర్ పంచాయతీ ఈవో అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛపథం కార్యక్రమం విజయవంతమైంది. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే లింకు రోడ్లు, కలికిరి మండల కేంద్రం నుంచి ఇతర మండలాలకు వెళ్లే లింకు రోడ్లను అధికారులు తమ సిబ్బందితో శుభ్రం చేయించారు. అధికారులు సైతం కార్యక్రమాల్లో పాల్గొని రోడ్లు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో భానుమూర్తిరావు మాట్లాడుతూ ప్రతి బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడం జరిగిందన్నారు. ఈ మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మహ్మద్ రియాజుద్దీన్, ఎంపీడీవో కార్యాలయం పరిపాలనాధికారి సురేష్‌బాబు, మేజర్ పంచాయతీ శానిటేషన్ మేస్త్రి వెంకటముని, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్వచ్ఛపథం కార్యక్రమం దృశ్యం

పంచాయతీ కార్యాలయం

## ఆకస్మిక తనిఖీ

**కలికిరి, మే 20, ప్రభాతవార్త:**
కలికిరి మండలం కలికిరి మేజర్ పంచాయతీ కార్యాలయం డీపీవో రాధమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీపీవో రాధమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుద్ధ్య కార్యక్రమాలపై నిర్వహించే ఐవీఆర్ కాల్స్‌లో కలికిరి మండలంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు కాల్స్ వచ్చేలా పంచాయతీ అధికారులు, మండల స్థాయి అధికారులు పని చేయాలని డీపీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవో అశోక్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి



**గాలివీడు. మే 20. ప్రభాతవార్త.**
మండలం లోనిగోరాన్ చెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని కుమ్మరపల్లెలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పిస్తూ గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్న ఉపాధి హామీ పథకం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సమర్థవంతంగా అమలు కావడం అభినందనీయమని అన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ కార్మికులకు స్థానికంగానే ఉపాధి లభించడం వల్ల వలసలు తగ్గి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని తెలిపారు. అలాగే గ్రామాల్లో చెరువులు, కాలువలు, మట్టి రోడ్లు వంటి అభివృద్ధి పనులు జరుగుతూ గ్రామాల రూపురేఖలు మారుతున్నాయన్నారు. తీవ్ర ఎండల్లో కష్టపడి పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులకు మజ్జిగ పంపిణీ చేసి వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులకు వచ్చిన ప్రజలతో మాట్లాడి, వారికి ఉన్న సమస్యలు, వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

## జనగణన సర్వే తనిఖీ

తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని సిబ్బందికి ఆదేశం



జన గణన సర్వే ను పరిశీలిస్తున్న తహసిల్దార్ శివకుమార్

**పీలేరు మే 20 ప్రభాతవార్త:**
జనగణన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో అంకితభావంతో ఆదర్శవంతంగా సర్వే చేస్తున్న కార్యక్రమంలో తప్పులు లేకుండా సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తహసిల్దార్ శివకుమార్ అన్నారు. బుధవారం పీలేరు పట్టణంలో సర్వే నిర్వహిస్తున్న పనితీరును ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణన సర్వేకి పోయే వాలంటీర్లు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు ఐడి కార్డ్ తో పాటు పలు రకాల కావలసిన యాపులను పునరుదించుకొని సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శివకుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురగయ్య, ఏఎస్ఓ రెడ్డప్ప రెడ్డి, విలేజ్ రెవెన్యూ అధికారి ప్రసాద్ బాబు, సర్వేయర్ కిరణ్ తోపాటు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలులో కెమిస్టుల సమ్మె సంపూర్ణ విజయవంతం

తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన ఔషధ విక్రేతల సంఘం నాయకులు






**బద్వేల్ అర్బన్ మే 20 ప్రభాతవార్త :**
బద్వేలు అఖిల భారత కెమిస్టుల సమాఖ్య పిలుపు మేరకు బద్వేలు పట్టణంలో గురువారం నిర్వహించిన కెమిస్టుల సమ్మె విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్ ఔషధ విక్రేతల సంఘం ఆదేశాల మేరకు పట్టణంలోని మెడికల్ షాపుల యజమానులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సముద్రాల రాధాకృష్ణమూర్తి, గౌరవాధ్యక్షులు కె.వి. సుబ్బారావు, వేలూరి మురళీధర్ రెడ్డి, కార్యదర్శి దర్శి సుబ్బరాజా, కోశాధికారి మాలేపాటి సుధాకర్, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా సిద్ధవటం రోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన రహదారుల గుండా నినాదాలు చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అక్కడ అధికారులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన అంతర్జాల (ఆన్‌లైన్) మందుల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్న అధిక తగ్గింపులను (డిస్కౌంట్లను) అరికట్టాలి. నాసిరకం మందులు తయారు చేసే కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు కిషోర్ కుమార్, రవి చంద్ర నిమ్మకాయల భీమారెడ్డి, పత్తి నరసింహ, వెంకటరత్నం, సముద్రాల మల్లికార్జున, రవి, పామూరి వెంకటేశ్వర్లు, రామకృష్ణ, స్వరూప్ జి.వి రమేష్, రమణ యాదవ్, వాసవి మెడికల్స్ నవీన్, దాస సతీష్, కానుగల రఘురామయ్య, సురేష్, కందుకూరి రమేష్, మరియు పలువురు కమిటీ సభ్యులు, మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ పటిష్టతే లక్ష్యం

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


బిసిసెల్ అధ్యక్షున్ని సన్మానిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మే 20 ప్రభాతవార్త :**
తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం మండల తెలుగుదేశం పార్టీ బిసిసెల్ అధ్యక్షునిగా నియమితులైన బండి అమరాను కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీకి బిసిలు పట్టుకొమ్మలాంటివారన్నారు. పార్టీలో బిసిలకు అధిష్టాన సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి గెలుపొందేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పనిచేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను మంజూరు చేస్తోందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి సహాయనిధి కింద నియోజకవర్గంలో కోట్లాదిరుపాయలు నిరుపేదలైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరిగిందన్నారు. బిల్డంగ్ సొసైటి అధ్యక్షులు షంషీర్, జేసిబి వేణు, చేనేత సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో జిల్లా క్రీడాకారుల అద్భుత ప్రతిభ

**మదనపల్లె క్రైమ్, మే 20 ప్రభాతవార్త.**
అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో జిల్లా క్రీడాకారుల అద్భుత ప్రతిభ చాటినట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జి. చంద్రశేఖర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ మార్గదర్శకాల మేరకు మే 2026 నెలకు సంబంధించిన జిల్లా స్థాయి సాప్ లీగ్ ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అథ్లెటిక్స్ , వెయిట్‌లిఫ్టింగ్ క్రీడల్లో జిల్లా క్రీడాకారుల అద్భుత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలు, అకాడమీల నుండి క్రీడాకారులు తరలివచ్చి వివిధ విభాగాల్లో తమ ప్రతిభను చాటారన్నారు. వెయిట్ లిఫ్టింగ్, 100 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెములతో పాటు హైజంప్, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, రిలే పోటీలను నిర్వహించామన్నారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి సాప్ లీగ్ పోటీలకు ఎంపిక చేయటం జరిగిందన్నారు. వీరంతా రాబోయే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో అన్నమయ్య జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ కోచ్ ఏ. రవీంద్రనాథ్, పీడీ శరత్ కుమార్ నాయక్, ఫిజికల్ డైరెక్టర్ జగదీష్, డీఎస్ఏ సీనియర్ అసిస్టెంట్ మస్తాన్, ఎక్స్‌ట్రీమ్ ఫిట్‌నెస్ జిమ్ ప్రొప్రైటర్ మధు, జిమ్ ట్రైనర్ ఆనంద్ మరియు పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పోటీలను విజయవంతం చేసిన కోచ్‌లు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ సర్వేకు ప్రజలు సహకరించాలి

**సిద్దవటం మే 20 ప్రభాతవార్త**



ప్రభుత్వం చేపడుతున్న వివిధ సర్వే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని సిద్దవటం ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, సెన్సెస్ సర్వే మరియు ఇతర ప్రభుత్వ సర్వే కార్యక్రమాలకు సచివాలయ సిబ్బంది గ్రామాలలో ఇంటింటికీ వస్తున్నారన్నారు. కావున ప్రజలందరూ సచివాలయ సిబ్బందిని సహకరించి వారు అడిగిన వివరాలను అందించాలన్నారు. అలాగే ప్రభుత్వం నిర్వహించే సర్వేలు చేస్తున్న సమయంలో ఓటీపీలు వచ్చిన సందర్భంలో వాటిని సంబంధిత సిబ్బందికి తెలియజేసి సహకరించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర వాట్సాప్ గవర్నన్స్ సర్వీసెస్ ద్వారా అనేక ప్రభుత్వ సేవలను సులభంగా త్వరితగతిన పొందే అవకాశముందని ఎంపీడీఓ తెలిపారు. వాట్సాప్ గవర్నన్స్ సర్వీసెస్ వినియోగ విధానం తెలు సుకొని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## ప్రకృతి వ్యవసాయంలో మానవాళికి మనుగడ



**తంబళ్లపల్లె మే 20 ప్రభాతవార్త :**
ప్రకృతి వ్యవసాయంలో జీవన ఎరువులు, కషాయాలతో పండించిన పంటలతో మానవాళికి ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని జిల్లా వ్యవసాయాధికారి శివ నారాయణ తెలిపారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె, పరసతోపు పంచాయతీలలోని ప్రకృతి వ్యవసాయ పంటల క్షేత్రాలను పరిశీలించారు. ప్రతి రైతు రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు లేకుండా ప్రకృతి వ్యవసాయం తో భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందన్నారు. తంబళ్లపల్లె, పరసతోపు పంచాయతీలలోని వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కూరగాయలు, ఆకుకూరలు, వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిశ్రమ పంటలు వేసిన విధానాన్ని చూసి వారిని అభినందించారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం అవగాహనలో ఏపీ ఎల్ ఎన్ ఎఫ్ సిబ్బంది పనితీరు అను ప్రశంసించారు. మండలంలో గుండ్లపల్లి పంచాయతీ లో ప్రకృతి వ్యవసాయం తో పండిన పంటలు అదేవిధంగా మోడల్ స్కూల్లో విద్యార్థులు ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయ పంటల పై ఆరా తీశారు. భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయమే పరమావధిగా రైతు భావించేలా వ్యవసాయ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఏవో రమణ కుమార్, ఏఈఓ సురేష్, ఏపీ ఎన్ ఎల్ ఎఫ్ సభ్యులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

## కందుల గ్రూప్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2కె 26 ఫలితాలు

**కడప మే 20 ప్రభాతవార్త**
కెఎస్ఆర్ఎం కెఎల్ఎం, వరుసగా 6 వ సంవత్సరం విజయవంతంగా నిర్వహించిన KGCET. 2కె 26 ఫలితాలను కరస్పాండెంట్ మరియు ట్రెజరర్ కందుల రాజేశ్వరీ విడుదల చేశారు. మే నెల 1,2 3 తేదీలలో నిర్వహించిన పరీక్షలకు 2769మంది హాజరు కాగా 1506 అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కందుల శివానంద రెడ్డి జ్ఞాపకార్థం ) సరైన విద్యా అవకాశాలూ లేని గ్రామీణ విద్యార్థులను గుర్తించి, విద్యా, వృత్తి ఆశయాలను సాధించే కృషికి ముఖ్య పాత్ర పోషిస్తూ, వారి అభివృధి, సామర్థ్యా అంచనా వేయడం, ప్రతిష్టాత్మక కందుల గ్రూప్ అనుబంధ సంస్థలో ప్రవేశం పొందే అవకాశం. మరియు సౌకర్యాలు, స్కాలర్షిప్‌లు అందించడం మా ముఖ్య ఉద్దేశం అనీ గడిచిన 5సంవత్సరాలకు గాను 12000 పై చిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరు అయ్యారు, వారికి 15 లక్షల విలువైన ఉచిత విద్య, వసతి, రవాణా మరియు ఉచిత స్కాలర్షిప్ లు అందించడం జరిగింది .మా kgcet ద్వారా ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థికి మెరిట్ స్కాలర్షిప్ రూపేణ ప్రతి సంవత్సరం 3500 నుండి 10000 వరకూ పొందుతున్నారు అని తెలిపారు. ఈ ఏ పి సెట్ ద్వారా సాధించిన రాంక్ ఆధారంగా అభ్యర్థులకు స్కాలర్ షిప్స్ ఇ వ్వడం జరుగుతుందని వివరించారు మరియు వారి తల్లిదండ్రులకు, ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టీఎన్ ప్రసాద్, కే.ఎల్.ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.వి రత్నమ్మ, ఐ క్యూ ఏ సి డీన్ డాక్టర్ విజయ కిషోర్, కేజి సెట్ 2కే26 కన్వీనర్ అలగల హరికృష్ణ, డీన్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు మరియు వివిధ విభాగ డీన్లు మరియు కేజీసెట్2కే 26 నిర్వాహక సిబ్బంది, టెక్నికల్ స్టాఫ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.




## సమతుల్య ఎరువుల వాడకంపై అవగాహన




**మైదుకూరు, మే 20, ప్రభాతవార్త:**
మైదుకూరు మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం వనిపెంట శాస్త్రవేత్తలు శ్రీ విద్యా రాణి, డాక్టర్ పి విజయనిర్మల, ఎస్ ఫిరోజ్ హుస్సేన్, పలు విభాగాల శాస్త్రవేత్తలు రైతులకు సముతుల్య ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అటవీ చైతన్య ద్రావణాన్ని తయారు చేయించారు. దీనిలో 250 గ్రాముల అటవీ మట్టి, 250 గ్రాముల ఏక ద్వళ పిండి (కొర్రలు, రాగులు, అండు కొర్రలు), 250 గ్రాముల దిద్వళ పిండి (సెనగ, ఉలవలు) 50 గ్రాముల తాటి బెల్లం తీసుకోవాలి వీటిని 20 లీటర్ల మట్టి కుండలో ఆ నీటిని కలుపుకొని ఆ మిశ్రమాన్ని 20 లీటర్లు పట్టే మట్టి కుండలో భూమిలో కప్పి ఉంచాలి. పది సెంటీమీటర్లు బయటికి ఉంచి దానికి గుడ్డ కట్టి ఓ దయ మరియు సాయంత్రం కలేతిప్పి నాలుగు రోజుల్లో తయారు అవుతుంది. ఆ మిశ్రమాన్ని 1:20 నిష్పత్తిలో పంటలో తేమ ఉన్నప్పుడు సాయంకాలం సమయంలో భూమిపైన పిచికారి చేయాలి. దీనివలన మొక్కకు సూక్ష్మ లోపాలు, పోషక లోపాలను అధిగమించి మొక్క మంచి దిగుబడిని అందిస్తుంది. ఈ ద్రావణాన్ని 21 రోజుల లోపు ఆడుకోవాలని తెలియజేశారు. ఇందులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రామనందారెడ్డి, సేవా నాయక్, పీరయ్య, ఓబయ్య, తదితర రైతులు మరి రైతు సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మీ సేవతో ప్రజలకు సేవలు మరింత చేరువ

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు

**రాజంపేట, మే 20 ప్రభాతవార్త**
ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వెళ్లకుండానే వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందించడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. బుధవారం వీరబల్లె మండలంలో రాగిమాన్ దిన్నె పల్లె గ్రామానికి చెందిన ఆంజనేయులుకు చెందిన మీసేవ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సేవలను పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా అందించడానికి ఏర్పాటు చేయబడిన ఒకే ఒక్క వేదిక మీసేవ అన్నారు. ఈ కేంద్రాలు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరిస్తాయని తెలియజేశారు. అంతేకాకుండా రేషన్ కార్డుల సవరణ, భూముల సమస్యలు, కుల, ఆదాయ, జనన, మరణ సర్టిఫికెట్స్ ను మీసేవ కేంద్రాల ద్వారా పొందవచ్చునన్నారు. నూతన బోర్, గోకులం షెడ్ ప్రారంభించిన జగన్ రాజు ప్రతి గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని నియోజకవర్గ చమర్తి పేర్కొన్నారు. బుధవారంవీరబల్లె మండలం, వంగిమళ్ళ గ్రామపంచాయతీ, ఆమూరి వాండ్ల పల్లెలో పర్యటిస్తూ నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందిస్తున్నామని తెలియజేశారు. నూతన బోరు పనులు ప్రారంభం పట్ల గ్రామస్తులు చమర్తి జగన్ మోహన్ రాజుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గోకులం షెడ్లతో రైతులకు ప్రయోజనమని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల, పశువుల అభివృద్ధి కోసం చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. వీరబల్లె మండలం, కావలిగడ్డ గ్రామంలో పర్యటిస్తూ నూతనంగా నిర్మించిన గోకులం షెడ్ ను చమర్తి జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాడి పశువుల అభివృద్ధి కోసం రాయితీ కింద గోకులం షెడ్లను, పశుగ్రాసాన్ని కూడా అందిస్తుందని తెలియజేశారు. ఈసందర్భంగా రైతు పండుగ పోస్టర్స్ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు భానుగోపాల్ రాజు, సొసైటీ చైర్మన్ అమరేశ్వర రాజు, క్లస్టర్ ఇంచార్జ్ చలపతి, సీనియర్ నాయకులు రెడ్డప్ప రెడ్డి, పద్మాకర్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, నేతి వెంకటరమణ, మాజీ సర్పంచ్ నాగార్జున ఆచారి, జయ చంద్రారెడ్డి, భూషయ్య, నాగ సుబ్బా నాయుడు, ఐటిడిపి రమణ, తదితరులు పాల్గొన్నారు.


మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించిన జగన్ మోహన్ రాజు


వంగిమల్లలో ప్రజలతో మాట్లాడుతున్న జగన్ రాజు

## విద్యార్థులకు బహుమతి సత్కారం

**పీలేరు మే 20 ప్రభాతవార్త:**
పీలేరు మండలంలోని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు మొదటి బహుమతిని ప్రదానం చేసి సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మదనపల్లి డివైఈవో లోకేష్ రెడ్డి గ, ఉమ్మడి చిత్తూరు జిల్లా సహాధ్యక్షులు సుధాకర్ , అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి , అన్నమయ్య జిల్లా ఆర్థిక కార్యదర్శి శివ శంకర్ , పీలేరు మండల అధ్యక్షుడు పోరెడ్డి ఓబుల్ రెడ్డి , పీలేరు మండల ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి , కె.వి.పల్లి మండల గౌరవాధ్యక్షులు వీడి వెంకటేశ్వర్లు , కేవీపల్లి మండల అధ్యక్షులు రావూరు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్. ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సత్కారం చేస్తున్న దృశ్యం

## దోబూచులాడుతున్న టమోటా ధరలు

మొలకలచెరువు మార్కెట్లో బాక్స్ ధర రూ.700లు

**మొలకలచెరువు మే 20, ప్రభాతవార్త**
ములకలచెరువు టమోటా మార్కెట్లో టమోటా ధరలు దోబూచులాడుతున్నాయి. గత వారం రోజుల క్రితం ములకలచెరువు మార్కెట్లో బాక్సు ధర రూ. 800 పలికింది. అయితే ఉన్నట్లు ఉండి ధరలు తగ్గుతూ పెరుగుతూ ఉన్నాయి. గత రెండు రోజుల క్రితం బాక్స ధర రూ.650లు పలుకగా బుధవారం రూ.710లు పలికింది. ధరలు తగ్గి పెరుగుతుండడంతో రైతుల్లో నిరాశ ఏర్పడుతుంది. సుమారు ఎకరా పొలంలో టమోటా పంట సాగు చేసేందుకు రెండు లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ధరలు నిలకడగా పలుకుతుండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

